www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 జూన్ 2024
5
అన్నమయ్య

రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రిగా 'మండిపల్లి'

నేడు జిల్లాకు రాక - స్వాగత ఏర్పాట్లలో పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రిగా నియమితులయ్యారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలను స్వీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం తన కేబినెట్ సహచరులకు అర్హతల ఆధారంగా ఆయా శాఖలను కేటాయించారు. ముఖ్యమంత్రి శాఖలు కేటాయించిన అనంతరం రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తొలిసారిగా జిల్లా పర్యటనకు రానున్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లాలోని రేణిగుంట విమానాశ్రయం నుంచి పీలేరు మీదుగా అన్నమయ్య జిల్లాకు రానున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలోని టిడిపి కార్యకర్తలు, సహచరులు, అభిమానులు పెద్దఎత్తున స్వాగత సన్నాహాల్లో నిమగ్నం కావడం గమనార్హం.

ఎన్నికల ప్రక్రియలో అధికారుల కృషి ఎనలేనిది

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాన్ని అత్యంత పటిష్టమైన ప్రణాళికతో శాంతియుతంగా నిర్వహించి విజయవంతం చేయడంలో అధికారుల కృషి ఎనలేనిదని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు-2024 విజయవంతమైన సందర్భంగా ఎస్‌పి బి.కృష్ణారావు, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి జిల్లాధికారులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత సిబ్బందితో జిల్లా కలెక్టర్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పొప్పులు మొదలుకొని, కౌంటింగ్ ముగిసేంతవరకు సంబంధిత అధికారులందరి సమిష్టి కృషితోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందన్నారు. జిల్లాకు రాగానే ఎన్నికల నగరా మొదలైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎన్నికల విధులను అధికారులకు అప్పగించామన్నారు. నూతన జిల్లాలో ఎన్నికల నిర్వహణ మొదటిసారి అయినప్పటికీ అందరి సహకారం, సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఏ పని చేయాలనుకున్నామో ఆ పని పట్ల భౌతికంగా, మానసికంగా సిద్ధమైతే సాధ్యమవుతుందని హితవు పలికారు. ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువ మానవ వనరులు ఉన్నా సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించామన్నారు. అప్పగించిన పనులను చాలా చక్కగా ప్రణాళిక ప్రకారం అలసిపోకుండా ఎవరి కేడర్లో వారు సమర్థవంతంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుండి వచ్చిన సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు సైతం నూతన జిల్లాలో ఎలాంటి ఇబ్బందికరమైన సంఘటనలు జరగకుండా విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో యావత్తు జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలీసు శాఖకు పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్ల జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు లేకుండా ఎన్నికల విజయవంతం గలిగామని, పోలీసు శాఖలోని కిందిస్థాయి కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐలు, సిఐలు, డిఎస్‌పిలు, అదనపు ఎస్‌పి దాకా అందరూ శక్తి వంచన లేకుండా సహకరించారని ఎందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేషన్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ గత ఫిబ్రవరి మాసం నుండి అధికారులందరూ కొత్త ఎనర్జీతో ఎన్నికల ఒరవడిని సాహసోపేతంగా నిర్వహించారన్నారు. సాధారణ ఎన్నికలు అనేవి అందరికీ ఒక పాఠం లాంటిదని భవిష్యత్తులో జరిగే ఎన్నికలకు ఎక్స్పీరియన్స్‌గా ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు అడిషనల్ ఎస్‌పి రాజకమల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, ఆర్‌డిఒలు మోహన్‌రావు, రంగస్వామి, హరిప్రసాద్, సిరికల్చర్ డిడి రాజశేఖర్‌రెడ్డి తదితర జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ నరసింహారావు పాడిన పాటలు అందర్నీ అలరించాయి. ఎన్నికల విధులలో పాల్గొన్న జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రం, మెమోంటోలను కలెక్టర్ అందజేశారు. కలెక్టర్‌ను జిల్లా అధికారుల బృందం ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

వైద్యుల నిర్లక్ష్యం..బాలింత మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రసవం కోసం వచ్చిన మహిళ ప్రాణాలు కోల్పోయింది. పట్టణ పరిధిలోని మదనపల్లి రోడ్డులో ఉన్న వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంజుల జ్యోతి (20) అనే బాలింత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందంటూ ఆమె బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. కడప జిల్లా చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మంజుల జ్యోతిని పులివెందుల ప్రాంతంలోని గురుజాలకు చెందిన మంజుల మల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. జ్యోతి మొదటి కాన్పు కోసం పుట్టింటికి వెళ్ళింది. పుట్టింట్లో ఉంటూ రాయచోటిలోని శ్రీవల్లి హాస్పిటల్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటూ వచ్చింది. డెలివరీ కోసం గురువారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని శ్రీవల్లి హాస్పిటల్‌లో చేరింది. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేశారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఆమెకు ఆపరేషన్ అనంతరం అధికంగా రక్తస్రావం అవుతూ ఉండడంతో హాస్పిటల్ సిబ్బంది వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మంజుల జ్యోతి మృతి చెందిన విషయాన్ని వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులకు తెలిపి రూ.40 వేలు డబ్బులు కడితేనే మృతదేహాన్ని ఇస్తామంటూ హాస్పిటల్ సిబ్బంది మొండికేశారు. మృతురాలు బంధువులు మా వద్ద అంత డబ్బులు లేవంటూ రూ.10 వేలు చెల్లిస్తామంటూ ప్రాధేయపడ్డారు. కానీ హాస్పిటల్ సిబ్బంది కనికరించలేదు. తమ బిడ్డను చంపిందే కాకుండా తమనే డబ్బులు అడుగుతారా అంటూ హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయిందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హాస్పిటల్ వద్దకు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలు జ్యోతి కుటుంబ సభ్యులు

భూ హక్కు చట్టం రద్దు హర్షణీయం

- న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాయచోటి : చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల ఆస్తులకు భద్రత లేని భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండవ సంతకాన్ని చేసినందుకు అన్నమయ్య జిల్లా రాయచోటి న్యాయవాదులు సంఘం అధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపడానికి శుక్రవారం రాయచోటి కోర్ట్ ఆవరణలో చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ఆయనకు బొకేను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ హక్కు చట్టాన్ని రద్దు కోసం న్యాయవాదులు మూడు నెలల పాటు కోర్టు విధుల బహిష్కరణ చేసి వివిధ రూపాలలో చేసిన ఉద్యమాన్ని గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ చంద్రబాబు నాయుడు ఉద్యమాన్ని గుర్తించి టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడానికి సిద్ధమవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ మాట్లాడుతూ వృద్ధుల పెన్షన్, పిల్లల చదువుల కోసం ఇస్తున్న సొమ్మును, దివ్యాంగుల పెన్షన్ లాంటి ముఖ్యమైన పెన్షన్లు తప్ప మిగిలిన అన్ని రకాల ఉచిత పథకాల సొమ్మును ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినప్పటికీ అదే సొమ్మును రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసి శాశ్వత ఆదాయాన్నిచ్చే అమరావతి అభివృద్ధికి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై పట్టణాలకు తరలిపోతున్న యువతకు అమరావతిలోనే ఉపాధి దొరికే విధంగా అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనిషికి కాళ్ళు చేతులు విరగ్గొట్టి మూల పడేసిన విధంగా జగన్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా అభివృద్ధి అనే కాళ్ళను నరికివేసి రాష్ట్రాన్ని మూలన పడేసిందని అన్ని రంగాలలో చతికిలబడిన రాష్ట్రాన్ని బాగు చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి డి.నాగముని, రాజ్ కుమార్‌రాజు, ఆనంద్ కుమార్, ధనుంజయ్ కుమార్, కృష్ణయ్య, చిన్నయ్య, ఉదయగిరి రామాంజనేయులు, హుమయూన్ భాష, వరలక్ష్మి, సుబ్బరాయుడు, ఖిజరాలి, జూనియర్ ఆనంద్, ఉత్తేజ్ కుమార్, ఇలియాస్ బాషా, న్యాయవాద గుమస్తా సంఘం నాయకులు వీర నాగయ్య, నాగరాజా పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : సామాన్య ప్రజలను, న్యాయవాదులను వేదనకు గురిచేసిన భూహక్కు చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండవ సంతకంతో రద్దు చేసినందుకు టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు వద్ద న్యాయవాదులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ భూహక్కు చట్టం రద్దు కోసం మూడు నెలలు ఉద్యమాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, చంద్రబాబు నాయుడు ఆ చట్టాన్ని రద్దు చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ న్యాయవాదులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పిన హామీని సైతం నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారత్ అసోసియేషన్ అధ్యక్షులు నసరుద్దీన్, సీనియర్ న్యాయవాది కృష్ణకుమార్, న్యాయవాదులు రమేష్ నాయుడు, వెంకటరమణ, రామచంద్ర రాజు, ఆనంద్ కుమార్, బాసినేని రమేష్, కట్టి సుబ్బరాయుడు, వి.వి.రమణ, వెంకటస్వామి, కాశీ విశ్వనాథ్, గోవర్ధన్‌రెడ్డి, తోఫిక్, షాహిద్, అక్షయ్ దినేష్ పాల్గొన్నారు.

పీలేరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూ హక్కు చట్టం రద్దు చేస్తూ ఫైల్‌పై రెండవ సంతకం చేసినందుకు న్యాయవాదుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లా డుతూ గత ప్రభుత్వంలో తాము భూహక్కు చట్టం రద్దు కోసం మూడు నెలల పాటు నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ ఏమాత్రం స్పందన లేకుండా పోయిం దన్నారు. చంద్రబాబు భూ హక్కు చట్టం రద్దు చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎస్‌ఎండి అన్సారి, న్యాయవాదులు భవాని శంకర, తెనాలి రామ సుబ్రహ్మణ్యం, ఎంఆర్ వెంకట రమణా రెడ్డి, చంద్రకుమార్‌రెడ్డి, షౌకత్‌అలీ, ఇర్ఫాన్, రామస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ నిర్వహించాలి

- పీస్ కమిటీ సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మత సామరస్యానికి ప్రతీకని తెలిపారు. ఈ నెల 17వ తేదీ బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. రాయచోటి పట్టణంలో ఉన్న జంతు వధశాలల నందు నీటి సమస్య రాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. జంతువధశాల నందు వచ్చే వేస్ట్‌ను దూరంగా చేయాలని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 34వ వార్డు నందు డ్రెయినేజీ కాలువల్లో చెత్త పేరుకుపోయి డ్రెయినేజీ నీరంతా రోడ్లపైకి వస్తోందని కాలువలలో మురికిని తొలగించి సమస్య పరిష్కరించాలని 34వ వార్డు ముస్లిం మత పెద్దలు జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని జెసి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ముస్లిం సోదరులు ఎక్కువగా ఉన్నారని బక్రీదు పండుగను అన్ని మతాల వారు పరస్పరం సహకరించుకొని సోదర భావంతో పండుగను జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి డాక్టర్ రాజ్ కమల్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- పాఠ్యపుస్తకాల పంపిణీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా ప్రమాణాలు ఉండాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎన్‌సిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ముందుగా పాఠశాల ప్రారంభమైన జూనియర్ కళాశాల తరగతి గదులను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో షాజహాన్ బాషా మాట్లాడుతూ ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి చదువులను అందించిన ఘనత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉందని తెలిపారు. ఇక్కడ చదివే పిల్లలకు ఏమాత్రం లోటు లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా ప్రమాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ఉన్నత స్థాయి ప్రమాణాలతో విద్యనందించాలని ఈ విషయంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదన్నారు. పేద విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెరిగినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులు సైతం తమ గురువులను గౌరవిస్తూ వారికి భయపడి కష్టపడి, ఇష్టపడి చదివినప్పుడే రాణించగలరని తెలిపారు. పాఠశాలకు ఏ అవసరం ఉన్నా తనను సంప్రదిస్తే తక్షణమే వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల చదువుల కోసం ఉపాధ్యాయుల ఎంతో కష్టపడుతున్నారన్నారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో 64 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించారని వివరించారు. అందులో ఓ విద్యార్థి 592 మార్కులతో టాప్ ర్యాంకర్‌గా నిలిచారని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, డివైఇఒ శ్రీరామ పురుషోత్తంరెడ్డి, ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

లోకేష్‌కు పూలబొకే ఇస్తున్న మిట్స్ అధినేత విజయభాస్కర్ చౌదరి

మంత్రి లోకేష్‌తో 'మిట్స్' అధినేత భేటీ

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌ను మిట్స్ కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి శుక్రవారం విజయవాడలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసంలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపామన్నారు. మంత్రి వర్గం లో నారా లోకేశ్ మానవ వనరులు అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖా మంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేసామన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన 'చమర్తి'

రాజంపేట అర్బన్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చన్నాయుడు ను శుక్రవారం ఆయన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు చమర్తి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, రాజంపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చమర్తి సురేష్ రాజు, బిజెపి పార్లమెంట్ యువ నాయకులు మహేష్ రాజు, గోరాం చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

'మండిపల్లి'కి 'రేవూరి' అభినందనలు

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని విజయవాడలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రామ్మోహన్ కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రమశిక్షణకు మారుపేరు విజయభారతి స్కూల్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రమశిక్షణకు మారుపేరుగా విజయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిలుస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం బళ్లారి డ్రమ్స్, బాణాసంచా పేల్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ మదనపల్లె విద్యా ప్రధాతగా సేతు సారు నిలుస్తారన్నారు. ఎంతోమంది పేదల పిల్లలకు తన పాఠశాలలో ఉచిత విద్యనందిస్తూ పలువురికి స్ఫూర్తిగా ఉన్నారన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం నుంచి రెండు, మూడు ఎకరాలు స్థలాన్ని క్రీడా మైదానం కోసం కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. భారతీయ అంబేద్కర్ సేన అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ మదనపల్లెకు రెండోసారి షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగా రావడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆయనకు మరెవ్వరు సాటిరారన్నారు. విద్యాప్రదాత సేతు సార్‌కు అవకాశం ఉంటే టిటిడి బోర్డు మెంబర్ కానీ, ఎడ్యుకేషన్ బోర్డులో కీలక పదవిని కానీ కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు షాజహాన్‌బాషాను పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి మెమోంటోను బహూకరించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, పులి మహాలక్ష్మి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

మాటపై నిలబడే వ్యక్తి చంద్రబాబు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లి

మాటపై నిలబడే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని మదనపల్లి ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తక్షణమే ఐదు హామీలపై తొలి సంతకం చేసి మెగా డిఎస్‌సి, పింఛన్ రూ.4 వేలకు పెంపు, భూ హక్కు చట్టం రద్దు, యువతకు ఉపాధి కోసం స్కిల్ సర్వే, అన్న కాంటీన్‌ల పునరుద్ధరణ హామీలను అమలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల కోసం చంద్రబాబు నాయుడు అహర్నిశలూ కష్టపడే వ్యక్తి అని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, డైరెక్టర్ నాదెళ్ల శివప్రసాద్, టిడిపి నాయకులు స్నోఆఫ్ సీన, గిరీష్, సంషీర్, మాజీ కౌన్సిలర్లు సాకే లక్ష్మీదేవి, పులి మహాలక్ష్మి, రాధ పాల్గొన్నారు

ఆరోపణలు అవాస్తవం : వైసిపి

ప్రజాశక్తి-రాయచోటి

మండలంలోని బోయపల్లెకు చెందిన సిద్దార్థ్ గౌడ్ తమపై చేసిన ఆరోపణలలో వాస్తవాలు లేవని మండల వైసిపి బిసి నాయకుడు పల్లపు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పెమ్మాడపల్లెలో సర్వే నెంబర్ 374/4లో 72 సెంట్ల భూమిని 2005వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం ద్వారా పట్టాను ఇచ్చారన్నారు. ఆ భూమిని అప్పటి నుంచి తాము అనుభవించుకుంటున్నామన్నారు. ఆ సమయంలో తమ కుటుంబం ప్రత్యక్ష రాజకీయాలలోనే లేదన్నారు. ఆ సమయంలో ఎంతో మందికి ఆ ప్రాంతంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. సిద్దార్థ్ గౌడ్ అనే వ్యక్తి అటు ప్రజల్లోనూ, ఇటు నాయకుల మధ్య చిచ్చు పెట్టేందుకు సదరు భూమిని తాము కాజేసామని ఆరోపించారన్నారు. వారి ఆరోపణలలో నిజం లేదన్నారు. 20 సంవత్సరాల క్రితం రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి లేరని, ఇక ఏవిధంగా ఆ భూమిని మాకు శ్రీకాంత్‌రెడ్డి ఇప్పించ గలుగుతారో ఆరోపణలు చేస్తున్నవారు ఆలోచించాలన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డిలపైన సిద్దార్థ్ గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. బిసి వర్గంలోని వడ్డెర కులానికి చెందిన తాము బిసిల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుచున్నామన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవిందరాజ్

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి

- సేలం పెరియార్ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోవిందరాజ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఖచ్చితత్వంపై దృష్టి సారించాలని సేలం పెరియార్ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోవిందరాజ్ తెలిపారు. అంగళ్ల సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ వారు రెండు రోజుల పాటు భాష, సాహిత్యంపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో 'పటిమ' మాత్రమే కాకుండా 'ఖచ్చితత్వ'పై కూడా దృష్టి పెట్టాలని, అందుకోసం వారు ఓర్పుతో 'ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నింగ్'పై శ్రమించాలన్నారు. ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రస్తుతం ప్రతి విద్యార్థి ప్రపంచ దేశాలలో ఎక్కడైనా ఉద్యోగం సంపాదించే స్థాయికి ఎదిగాడని, అదేస్థాయిలో అనేక ఇతర దేశాలభాషలపై పట్టు సాధించేలా ఎదగాలని తెలిపారు. విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించి, జర్నల్స్ ప్రచురణకు తోడ్పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను అంతర్జాతీయ సదస్సులో విద్యార్థులకు స్కిల్స్ అందజేసేలా మిట్స్ కలశాలలోని ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ వారు కృషి చేస్తున్నారని అభినందనలు తెలియజేసారు. ఈ వర్క్ షాప్‌లో ఆన్ లైన్ ద్వారా ప్రొఫెసర్ ఫిరోజా జుస్సావాలా, ఎమెరిటా యూనివర్శిటీ ఆఫ్ న్యూ మెక్సికో, యుఎస్‌ఎ, ప్లీనరీ ప్రసంగాన్ని డాక్టర్ వి.కె.కార్తీక, అసిస్టెంట్ ప్రొఫెసర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తిరుచ్చి మరియు డాక్టర్ కంధరాజా, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐఐటి కాంచీపురం తదితరులు ప్రసగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ అతహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రామచంద్రారెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 10 గంటలకు సచివాలయాలను తనిఖీ చేస్తామన్నారు. తనిఖీ సమయంలో సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోయినా, సచివాలయం తెరవక పోయినా , అలాంటి వారి పైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ డబ్ల్యు ఎం యాప్‌కి సంబంధించి స్టార్ట్ ఎండ్ ఆక్టివిటీ చేయాలన్నారు .ప్రతి సచివాలయ ఉద్యోగి సెలవుపై వెళ్లేటప్పుడు పంచాయతీ కార్యదర్శితో పాటు ఎంపిడిఒకు సమాచారం అందించాలని తెలిపారు. శానిటేషన్‌లో వెక్టర్ కంట్రోల్ పాయింట్స్‌ను పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి సోమవారం జివిపి పాయింట్స్ క్లియర్ చేయాలని, పారిశుధ్యంకు సంబంధించి వర్షపు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ఒహెచ్ఎస్ఆర్, జిఎల్ఎస్ఆర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని వెంకోజిగారిపల్లె సమీపంలోని డాక్టర్ తూపల్లి వెంకటరామయ్య కల్యాణ మండపం యజమా నులు తూపల్లి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి, మదురై శాఖల వారి సౌజన్యంతో ఈనెల 16న ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టివిఆర్ కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి నుంచి ప్రఖ్యాత కలిగిన, ప్రత్యేక నైపుణ్యం కలిగిన వైద్యులు, సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొంటున్నారని అన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందాలని తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచిత ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలతో పాటు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయబడునని పేర్కొన్నారు. కంటి అద్దాలు అవసరమైన వారికి తక్కువ ధరకే వైద్య శిబిరం వద్ద కళ్ళ అద్దాలను అందిస్తారని అన్నారు. కంటి శుక్లముల శస్త్ర చికిత్స నిమిత్తం అదే రోజు ఆసుపత్రికి వచ్చువారు రెండు రోజులకు సరిపడా దుస్తులను వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు. మండలంలోని ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9885163239 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

రుణాలు రెన్యువల్ చేసుకున్నవారికే సున్నా వడ్డీ

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు సహకార కేంద్ర పరపతి సంఘంలో ఈనెల చివరి లోపు రుణాలు రెన్యువల్స్ చేసుకున్న వారికే సున్నా వడ్డీ వర్తిస్తుందని డిసిసి బ్యాంక్ మేనేజర్ సివి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామాలలో 1029 మంది పంట రుణాలు పొంది ఉన్నారని అన్నారు. ఈనెల ఆలస్యం చేస్తే వారికి పావలా వడ్డీ వర్తించకుండా పోతుందని రైతులు ఈ విషయాన్ని గమనించి ఈ నెలాఖరులోపు రుణాలు రెన్యువల్ చేసుకోవడం వల్ల రైతులు ఎంతో ఉపయోగ ముంటుందని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని రైతులందరూ సద్వినియెగం చేసుకోవాలని తెలిపారు.

ఎంపిసి, సిఇసికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక కెజిబివి ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపిసి, సిఇసి గ్రూపులు చదవాలనుకే విద్యార్థినిలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నదని స్పెషల్ ఆఫీసర్ నీరజ పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు హాస్టల్ వసతి సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. మండలంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను తమ కళాశాలలో చేర్పించాలని కోరారు.

117 జిఒను సత్వరమే రద్దు చేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

117జిఒ ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలిపి వేయడం వలన ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యం అయిపోతాయని మాజీ ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు విఘాతం కలిగించే 117 జిఒను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలో 1,2తరగతులతోపాటు 3,4,5 తరగతులను యథావిధిగా నిర్వహించాలని అన్నారు. తద్వారా ప్రాథమిక విద్యకు ప్రభుత్వం జీవం పోయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టిసిలు ఇవ్వకుండా మూడవ తరగతిని పునఃప్రారంభించాలన్నారు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.

జనసేన ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి అయిన సందర్భంగా మండల పరిధిలోని బురకాయలకోటలో జనసేన సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోతుల సాయి నాథ్ ఆధ్వర్యంలో ఎన్‌డిఎ కూటమి శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సెంట్రల్ స్కూల్ వద్ద నుంచి బురకాయలకోట బస్టాండ్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండులో కక్ కటింగ్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి లేని ప్రభుత్వం ఏర్పడిందని, ప్రజలకు సురక్షితమైన పాలన అందుతుందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తారని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు అందుతుందన్నారు. ఈ ర్యాలీలో జనసేన నాయకులు రామా, శ్రీనివాసులు, జెసిబి శీనా, రెడ్డి సురేష్, సుదర్శన్, లక్ష్మణ్, బావాజీ, మహేష్, కామాక్షి అంజి, మూర్తి, మణి, టిడిపి నాయకులు సుధాకర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మారమ్మ తిరుణాలలో పొంగళ్లు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన మారమ్మతల్లి ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అమ్మవారి పొంగళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజతో ప్రారంభించి అనంతరం ధ్వజారోహణం, మహా గణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యమ్మ, మారమ్మతల్లికి 101 టెంకాయలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, మూల మంత్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం పవర్ జిమ్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారని నిర్వాహకుడు డా.సయ్యద్ అహ్మద్ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని సబ్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం చాలా గొప్ప కార్యక్రమమని, యువకులు ఈ విధంగా ఉత్సాహంగా రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదాతలందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడునెలలకొకసారి నిర్భయంగా వచ్చి రక్తదానం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డిరాణి, ఓబులేసు, రమేష్ కత్తి, బీజేపీ నాయకులు జగదీష్, ఎస్‌టి సంఘ నాయకులు నాగేంద్ర నాయక్, సమాజ సేవకులు భూపతియాదవ్, అరుణ్,శేఖర్, షారుక్, సల్మాన్, మంజుల, అర్షద్, వేణు కత్తి, దీప బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది సులోచన, నరేష్ పాల్గొన్నారు.

సుండుపల్లి: రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ఎస్ఐ

రాయచోటి : రక్తదానం చేస్తున్న యువకుడు

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి యువత స్వచ్ఛం దంగా ముందుకువచ్చి రక్తదానం చేశారని నిర్వాహకుడు డాక్టర్ సయ్యద్ మైనూద్దీన్ పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం చాలా గొప్ప కార్యక్రమ మని, యువకులు ఈ విధంగా ఉత్సాహంగా రక్తదానం చేయడం అభినంద నీయమని అన్నారు. రక్తదాతలందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకొకసారి నిర్భయంగా వచ్చి రక్త దానం చేయవ చ్చని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో చాలా మంది రక్తం లభించక మరణిస్తున్నారని వారి కోసం ఆరోగ్యవంతులు రక్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో రక్త దాతలు సమీర్, అరుణ్, మస్తాన్, రియాజ్, జుబేర్, మహమ్మద్, ఉస్మాన్,ఇన్నాల్ పాల్గొన్నారు.

శిలాఫలకాల ధ్వంసంతో అభివృద్ధిని చెరిపేయలేరు

- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

శిలాఫలకాలను ధ్వంసం చేసినంత మాత్రాన తాము చేసిన అభివృద్ధిని ఎవ్వరూ చెరిపెయ్యలేరని వైసిపి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కోడూరులోని టోల్గేట్ వద్ద ఉన్న బస్టాండ్‌పై, చిట్వేలి రోడ్డులోని బ్రిడ్జి, ఆస్పత్రి వద్ద ఉన్న శిలాఫలకాలను,పేర్లని జనసేన, టిడిపి కార్యకర్తలు పగలగొట్టారని కొరముట్ల అన్నారు. శుక్రవారం ఆయన వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇవిఎంలను ట్యాంపరింగ్ చేసో, ఎలాగో అధికారంలోకి వచ్చిన వారు అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన 15 ఏళ్లల్లో తాను ఎమ్మెల్యే గా ఉన్నపుడు ఏ రోజు కూడా దాడులు జరగలేదని, చీమకు కూడా హాని తలపెట్టలేదని అన్నారు. టోల్‌గేట్ వద్ద ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బస్టాండ్‌కు విద్యుత్ కనెక్షన్ తొలగించి మరుగుదొడ్లలో మెయింటెనెన్స్ లేకుండా చేయడం పట్ల విచారకరమని అన్నారు. కోడూరులో మునుపెన్నడులేని విధంగా కొంతమంది కొత్త రాజకీయాలకు తెరలేపుతున్నారని ఇది మంచి సంస్కృతి కాదని పేర్కొన్నారు. మీరు ఏమన్నా చేయాలనుకుంటే మేము చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేసి చూపించాలి కానీ ఇలా శిలాఫ లకాలు, కార్యకర్తలపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైఎస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రాజు, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రామకృష్ణ,సిద్దయ్య,రఘు,డీవీ రమణ, నాగరాజా, రమణారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివారెడ్డి, రవిచంద్రరెడ్డి పాల్గొన్నారు.

ధ్వంసమైన శిలాఫలకాలను పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

విద్యార్థులు సవాళ్లను ఎదుర్కోవాలి

- ఉద్యాన కళాశాల ఎడి డాక్టర్ కె.గోపాల్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులు సవాళ్లను ఎదుర్కోవడం ద్వారా విజయం సాధిస్తారని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బిఎస్‌సి ఉద్యాన కోర్సు నాలుగవ సంవత్సర విద్యార్థులకు మూడవ సంవత్సర విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ 2020 సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు కోవిడ్ ప్రభావం వల్ల అనేక సవాళ్లను ఎదుర్కొన్నారని అన్నారు. తరగతుల నిర్వహణ, పరీక్షల నిర్వహణ తదితర అంశాల్లో ఎదురైన సవాళ్లను అధిగమించామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎపిఎండిసి సిపిఒ ఎం.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులను గౌరవించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఒఎస్ఎ డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, ప్రొఫెసర్ స్వరాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ శివప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

వీడ్కోలు సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీన్ డాక్టర్ గోపాల్

భరత నాట్యం చేస్తున్న విద్యార్థులు

మైనార్టీ వాద రచయిత్రి 'షాజహానా'

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలంగాణ ఉద్యమ పోరాటంలో మైనారిటీవాద రచయిత్రిగా ప్రఖ్యాతిగాంచిన షాజహానా పుట్టిన రోజును యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా నిర్వహించానారు. కార్యక్రమంలో ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి. రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత అయిన దిలావర్ యాకూబ్ కుమార్తె అని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎస్‌వి సత్యనారాయణ పర్యవేక్షణలో తెలుగులో సాహిత్యంలో ముస్లింవాద సాహిత్యం అనే అంశం పై పరిశోధన చేశారని అన్నారు. కడప జిల్లా కోర్టు పిపి సుధారాణి మాట్లాడుతూ షాజహానా వతన్ (కథల సంకలనం), దర్దీ (కవిత్వం), అలావా చాంద్ తార వంటి రచనలు చేశారు అన్నారు. భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ షాజహాన్ ముస్లిం సామాజిక ఉద్యమ కర్త, చమన్ పత్రిక సంపాదకుడైన స్కైబాబ సతీమణి అన్నారు. షాజహానా ప్రతిభకు తార్కాణంగా 2017లో తెలంగాణ ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారన్నారు. జి.హరిభూషణరావు మాట్లాడుతూ షాజహానా కవిత్వం ఆంగ్లం, హిందీ, జర్మనీ లాంటి పలు భాషల్లోకి అనువాదాల్కెనట్లు తెలిపారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు షాజహాన్ కవితను గానం చేశారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వర్, సుమతి, రాణి, మణీల పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పొగాకు ఆరోగ్యానికి హానికరమని ఐటిటిసి కౌన్సిలర్లు సుబ్బయ్య, సుమలత పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పులివెందుల ఏరియా ఆసుపత్రిలో జాతీయ పొగాకు నియ ంత్రణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తులు పాడ వడం, పక్షవాతం నోటి కేన్సర్ వ్యాధులొస్తాయని పేర్కొన్నారు. పొగాకు వినియోగాన్ని వ్యతి రేకంగా ప్రతిజ్ఞ చేశారు. పొగాకు పరిశ్రమల నుంచి పిల్ల లను రక్షించాలని అని పొగాకు వినియోగానికి వ్యతి రేకంగా వ్యూహాత్మక కార్యచరణను ప్రకటించారు. ఆసుపత్రి ప్రాం గణంలో ఎవరు పబ్లిక్ స్మోకింగ్ చేయకూడదని, అని అలా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. కార్య క్రమం లో ఆసుపత్రి సిబ్బంది, బాదల్ వల్లి, కమ్యూనిటీ డెవలప్‌మె ంట్ సొసైటీ మేనేజర్ వల్లి, అకౌంటెంట్ నాగిని బాషా శాంతి, పుష్పరాజు, భాగ్యలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చిన్నపిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కన్నెలూరు గ్రామంలోని -1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను కోరారు. శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయస్సు గల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. పిల్లలను ఇంటివద్ద పెట్టుకోవడం వల్ల వారు మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందేందుకు అంగన్వాడీ కేంద్రాలు కృషిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ ఎస్.గంగాదేవి, డి.మాధవి, సహాయకులు ఎస్.రోషన్ని, జి.భవాని, జి.కుమారి తల్లులు ఎమ్‌పిపి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి శ్రీకారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రగతికి శ్రీకారం చుట్టారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేసిన సందర్భంగా శుక్రవారం టిడిపి కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని మెగాడి ఎస్‌సిపై తొలి సంతకం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, సైకో పాలను సాగనంపి ప్రజా పాలనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **వేంపల్లె :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ లపై ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సంతకాలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటను నిలబెట్టుకున్నారని దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు పివి రమణ, నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మిషన్ వీధిలో సిఎం చంద్రబాబు చిత్ర పటానికి టిడిపి నాయకులు పాలభిషేకం చేశారు. అనంతరం ప్రజలందరికి స్వీట్స్ పంపిణీ చేశారు. బిటెక్ రవి ఆధ్వ ర్యంలో పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చావలి సంటెన్న, చింతలమడుగుపల్లెకు చెందిన టిడిపి నాయకులు రామస్వామి, నాగ శేఖర్, బాలయ్య, ఎంవి రమణయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాగేష్, రాజేష్, నాగముని, రామాంజ నేయులు, డి. రమణయ్యతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

హామీల అమలులో మొదటి మెట్టు ఎక్కేశాం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

2024 ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాలలో మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి ఎన్నికల హామీలలో మొదటి మెట్టు ఎక్కేశామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డిఎస్‌సిపై ఆయన తొలి సంతకం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ.4వేలకు పింఛన్ పెంపు,అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై మొత్తం 5 సంతకాలు చేశారని, త్వరలో మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేస్తారని చెప్పారు. ప్రస్తుతం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌తో సమీక్ష నిర్వహించామని, నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీలలో 23 వేల మంది లబ్ధిదారులకు ఇచ్చిన ఒక సెంటు ఇంటి స్థలంలో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదని, త్వరలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రొద్దుటూరు అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపడతామని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు ప్రస్తుతానికి పెండింగ్ ఉన్నాయని తన దృష్టికి వచ్చినట్లు, పెన్నా నదిపై నిర్మిస్తున్న ఆర్‌టిపిపి బ్రిడ్జి పనుల కాంట్రాక్టర్ తనను కలిసి దాదాపు రూ.14 కోట్ల పనులకు సంబంధించిన నిధులు ఇంకా విడుదల కాలేదని చెప్పారన్నారు. రానున్న రోజులలో వైసిపిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసే దిశగా జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇ.వి. సుధాకర్ రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

జెసిబితో కంప చెట్లను తొలగిస్తున్న అధికారులు

ముళ్ల చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దూరు కస్బా నుంచి పెద్దమాదిగపల్లి మీదుగా నాగిరెడ్డిగారిపల్లి వరకు పంచాయతీరాజ్ రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ముళ్ళ చెట్లను ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, సర్పంచ్ నాగులమ్మ ఆధ్వర్యంలో తొలగించారు. పెద్దమాదిగపల్లి ఎంపియుపిస్కూల్, నాగిరెడ్డిగారి పల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు పోవాలంటే ముళ్ళ చెట్లు రోడ్లకు ఇరు వైపులా ఉండేవని అన్నారు. స్థానికులు ఎంపిడిఒ దృష్టికి తీసుక వెళ్లిన వెంటనే స్పందించి జెసిపి పెట్టి కంపచెట్లు తొలగింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తన యుడు రవి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని కొత్త కోడూరులో వెలసిన గంగమ్మ దేవాలయం వద్ద కొత్త కోడూరు గంగమ్మ జాతర కార్యక్రమం ఈ ఏడాది ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు పాటు నిర్వహించిన గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగిందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గంగమ్మ జలాధివాసం కార్యక్రమంతో గంగమ్మ జాతర కార్యక్రమం ముగిసిందని పేర్కొన్నారు. గంగమ్మ తల్లి జలాదివాస కార్యక్రమానికి వెళ్లేటప్పుడు పెద్ద ఎత్తున కోలాటాలు, డబ్బులు, బాణాసంచా మహిళల నృత్యాలు నిర్వహిస్తూ భారీ జనస మూహంతో గంగమ్మ తల్లి జలాధివాస కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

ప్రారంభమైన గాలీటమ్మ తిరుణాల ఉత్సవాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని గాలివీడులో సోమ, మంగళవారాల్లో జరుగనున్న గాలీటమ్మ తిరుణాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. గాలిటమ్మ సోలెమును పట్టణంలో పెద్దూర్‌రోడ్డు బస్టాండ్ నుంచి రవీంద్రనగర్ గర్ల్స్ హైస్కూల్‌వీధి, వెంకటేశ్వరగుడి వీధి, గాండ్లవీధి హై స్కూల్ నుంచి శెట్టి వారి పల్లి వరకు ఊరేగింపు చేశారు. పూజారి సంపత్ ఆధ్వర్యంలో భక్తులు పూజ లు నిర్వహించి ప్రసాదాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఎగువపల్లి, పకీర రెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'నల్లారి'ని కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలికిరి

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పలువురు అధికారులు కలిసి అభినందించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి స్వగృహం నగిరి పల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ప్రభుత్వ అధికారులు నగిరి పెల్లికి చేరుకుని ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అధికారులంతా సహకరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో సువర్ణపాలన అందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఇఒ గురుమోహన్, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎంపిడిఒ

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వెంకటసుబ్బారెడ్డి (ఫైల్ ఫొటో)

ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువ మాచిరెడ్డి గారిపల్లెకు చెందిన ఎస్.వెంకటరెడ్డి కుమారుడు ఎస్.వెంకటసుబ్బారెడ్డి(41) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో గ్రామ సమీపంలోని అక్కగార్ల కుంట వద్ద ఉన్న గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో అకస్మాత్తుగా వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కనున్న సమాధిపై పడ్డాడు. ప్రమాదంలో శరీరంలోని ఓవైపు పక్కటెముకలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసర విభాగ వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలపై తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యంలోని సిటిఎం వద్ద పరిస్థితి విషమించి వెంకట సుబ్బారెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుని భార్య ఎస్ సంతోషి కుమారి తమకు పోలీస్ కేసు అవసరం లేదని, ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడం కార ణంగా వెంకటసుబ్బారెడ్డి మృతి చెందాడని, మృతిపై తమకు అనుమానాలు, అభ్యంతరాలు లేవంటూ పోలీసులకు రాతపూర్వకంగా స్టేట్మెంట్ ఇచ్చి మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం అవుట్ పోస్ట్ పోలీసులు నిమ్మనపల్లె పోలీసులకు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని పాలంగొల్లపల్లి బురుజుపల్లికి చెందిన చిన్నకొండ సుదర్శన్(42) మే 28వ అదృశ్యమై ఎట్టకేలకు శేషాచలం అడవుల్లో మృతి చెంది చెట్టుకి వేలాడుతూ శుక్రవారం ఉదయం గొర్రెల కాపరులకు కనిపించారు. సుదర్శన్ మృతి చెందిన తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి కుమార్తె , కుమారుడు ఉన్నారు. కుమార్తె వివాహం కాగా, కుమారుడు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు తెలి పారు. విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నకొండ సుదర్శన్ మృతిపై కేసు నమోదు మృతికి గల కారణా లను విచారణ చేస్తామని తెలిపారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

కేబుల్ వైర్ చోరీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పాపేపల్లి పంచాయతీలో వ్యవసాయం బోర్లు, పంచాయతీ తాగునిటీ బోర్లుకు అమర్చిన కేబుల్ వైరు, బోరు స్టాటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి, జనార్దన్, సర్పంచ్ పిరంబీ, రైతులు టి.చంద్రపాల్‌రెడ్డి, జి నరేంద్ర రెడి తెలిపారు. పి.తురకపల్లి తాగునీటి బోరు కేబుల్ వైరు 75 మీటర్లు, మాలపల్లి తాగునీటి బోరు వైరు 20 మీటర్లు, 20 అడుగుల ఇనుప పైపు, రైతులకు సంబంధించిన కేబుల్ వైరు 60 మీటర్లు చోరీ అయినట్లు తెలిపారు.